ప్రజాశక్తి

మంగళవారం 27 మే 2025

5

విజయనగరం

చిన్న వ్యాపారులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై
27న అవగాహన సదస్సు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లాలోని సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపారస్తులకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ పై మే 27న మంగళవారం ఉదయం 10.30 గంటలకు విజయనగరంలోని ఉల్లి వీధిలో ఉన్న చాంబర్ ఆఫ్ కామర్స్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ జిఎం శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవగాహన సదస్సులు తనతో పాటు పరిశ్రమల శాఖ అధికారులు లీడ్ బ్యాంకు మేనేజర్ తదితరులంతా పాల్గొని వ్యాపారస్తులకు రిజిస్ట్రేషన్ పై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని సూక్ష్మ చిన్న మధ్య తరహా వ్యాపారస్తులు పాల్గొనాలని కోరారు.

పరేషాన్

- వెంటాడుతున్న సర్వర్ సమస్య
- ఇకెవైసికీ అవస్థలే
- కొత్త కార్డులు, మార్పులు, చేర్పుల కోసం సచివాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

కొత్త రేషన్ కార్డుల జారీ, చేర్పులు, మార్పులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన ప్రక్రియ ఈ నెల 9 నుంచి ప్రారంభించారు. రేషన్ కార్డుల కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ప్రజలు సచివాలయాలకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే ఉన్న రైస్‌కార్డుతోపాటు ఆధార్ కార్డులు, జనన, మరణ ధ్రువపత్రాల జిరాక్సు కాపీలతో ఎంతో ఆశతో సచివాలయాలకు చేరుకుంటున్నారు. తీరా అక్కడికి వెళ్లాక అసలు సమస్య మొదలవుతోంది. సర్వర్ రూపంలో గంటలు, రోజుల తరబడి సమస్య వెంటాడుతోంది. సచివాలయాల చుట్టూ ఎంత తిరుగుతున్నా పనిమాత్రం కావట్లేదు. రోజూ సచివాలయానికి వెళ్లడం, అక్కడ గంటల తరబడి వేచి ఉండటం చివరికి నిరాశ చెంది వెనుదిరగడం లబ్ధిదారుల వంతవుతోంది. దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేశాక లబ్ధిదారులు ఇకెవైసి చేయాలి. ఈ ప్రక్రియ కూడా జాప్యమవుతోంది. మరోవైపు రేషన్ కార్డు దరఖాస్తుల స్వీకరణ ఈ నెలాఖరుతో ముగుస్తుందనే ప్రచారం సాగుతోంది. రేషన్ దరఖాస్తులను ఎప్పటివరకు స్వీకరిస్తారో అధికారుల నుంచీ సరైన ప్రకటన లేదు. దీంతో వెబ్‌సైట్ ఎప్పుడు మూసేస్తారోనని అర్హులైన వారంతా ఆందోళనకు గురవుతున్నారు.

ఆ దరఖాస్తులుంటే అంతే

గత వైసిపి ప్రభుత్వ హయాంలో అనేక మంది కొత్త రేషన్ కార్డులు, చేర్పులు, మార్పుల కోసం సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మారి ఏడాది కావస్తోంది. కానీ, ఆ దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుతం వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి వస్తే, ఆన్‌లైన్‌లో స్వీకరించడం లేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. కొత్తగా దరఖాస్తులను స్వీకరించకుండా, పాత దరఖాస్తూ పరిష్కరించకుండా చేస్తే తమ పరిస్థితి ఏమిటని, ఇంకెన్నాళ్లు ఎదురుచూడాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు గత ప్రభుత్వంలో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి కొత్త రేషన్ కార్డు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలని, లేకుంటే కొత్తగా నమోదుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

చాలా ప్రభుత్వ పథకాలకు సంబంధించి సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న రోజు నుంచి 21 రోజుల్లో పని పూర్తిచేయాలి. ఒక అధికారి నుంచి వారి ఎస్ఎల్ఎ రోజుల ఆధారంగా పరిశీలించి, సంబంధిత శాఖ అధికారులకు దరఖాస్తు పంపాలి. అలా చేయని వారిపై గత ప్రభుత్వంలో చర్యలు తీసుకునేవారు. కానీ గతంలో దరఖాస్తు చేసిన వాటికి ఏడాది గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ లేకపోవడం గమనార్హం.



ఇంకా పెండింగ్‌లో చూపిస్తున్న గతేడాది దరఖాస్తు

తప్పులతడకగా హౌస్ మ్యాపింగ్

గత ప్రభుత్వ హయాంలో హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేపట్టిన విషయం తెలిసిందే. ఇదంతా తప్పుల తడకగా సాగింది. ఒకే గ్రామంలో ఇద్దరి ఇంటిపేర్లు, వారి తండ్రి పేర్లు ఒకేలా ఉంటే చాలు.. కుటుంబ సభ్యుల వివరాలు, వాళ్ల ఆధార్ కార్డు వెరిఫికేషన్ చేయకుండా ఒకరికి బదులు మరొకరిని హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో నమోదు చేశారు. దీనివల్ల నేటికీ చాలా పథకాలకు అర్హులై ఉండి అనర్హులుగా మిగిలిపోతున్నారు. రేషన్‌కార్డు కోసం ఇప్పుడు వారంతా నానా అవస్థలు పడుతున్నారు.

ఇకెవైసి కావడం లేదు

రెండు వారాల క్రితం కొత్త రేషన్‌కార్డుకు దరఖాస్తు చేశాను. తరువాత ఎప్పుడు వెళ్లినా ఇకెవైసి కావడం లేదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో నేటికీ దరఖాస్తు చేసుకోవడానికి వీలుకావడం లేదు. వృత్తిరీత్యా విశాఖపట్నంలో ఉండటం, సర్వర్, ఇకెవైసి సమస్యలతో దరఖాస్తు చేసుకోలేక పోవడంతో వెళ్లి రావడానికి కొంత ఇబ్బందికరంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– ఎస్.చంటి, పాతబగ్గాం

పాతది పెండింగ్‌లో ఉందని..

గత ప్రభుత్వంలో రైస్ కార్డులో కుటుంబ సభ్యుల చేర్పు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఎన్నికల కారణంగా పెండింగ్‌లోనే ఉండిపోయాయి. ప్రస్తుతం అన్ని పత్రాలూ పట్టుకొని మళ్లీ దరఖాస్తు చేయడానికి వెళ్తే, గత ప్రభుత్వంలో చేసిన అప్లికేషన్ పెండింగ్‌లో ఉందని, మళ్లీ చేయడానికి కుదరదని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయానికి మూణ్నాలుగు రోజులపాటు వెళ్తే, దరఖాస్తులు పాతవి, కొత్తవి కలిసిపోవడంతో అప్లికేషన్ పరిశీలించలేకపోతున్నామని చెబుతున్నారు. త్వరలోనే పరిశీలిస్తామన్నారు. వారం రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు.

– సంగంరెడ్డి చిరంజీవి, పాతబగ్గాం

సర్వర్ సమస్య లేదు

తొలుత సర్వర్, ఇకెవైసి సమస్య తలెత్తింది. సర్వర్ అప్‌గ్రేడ్ చేశాం. దీంతో ప్రస్తుతం ఎక్కడా సర్వర్ సమస్య లేదు. ఇంకెక్కడ అయినా సర్వర్ సమస్య తలెత్తితే అది సిగ్నల్ లేకపోవడమే. గత ప్రభుత్వంలో వచ్చిన దరఖాస్తు మండల స్థాయిలో ఆమోదించి, ఉన్నతాధికారులకు పంపించాం. కానీ వాటిని పూర్తిగా ఆమోదించేందుకు అవకాశం లేకపోవడంతో పెండింగ్‌లో ఉన్నట్లు చూపిస్తోంది. అలాంటి దరఖాస్తులు సుమారు 200 వరకు పెండింగ్‌లో ఉన్నాయి.

– తిరుపతిరావు, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్

తొలగించిన కార్మికులను
విధుల్లోకి తీసుకోవాలి

- స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ వద్ద విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి సిఐటియు నాయకులు టివి రమణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో పనిచేస్తున్న సుమారు 4వేల మంది కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ఆలోచనను విరమించుకోవాలని, ప్రభుత్వ రంగంలోనే మరింత సమర్థవంతంగా నడపాలని, ఆంధ్రప్రదేశ్‌కు తలమానికంగా నిలిచిన విశాఖ ఉక్కును రక్షించాలని కోరుతూ ఈనెల 20 నుంచి కార్మికులు సమ్మె చేస్తున్నారని తెలిపారు. సమ్మె చేస్తున్న కార్మిక సంఘాల నాయకులతో వెంటనే చర్చించి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలని కోరుతున్నామన్నారు. విశాఖఉక్కును సెయిల్ లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎ.జగన్మోహనరావు, బి.సూర్యనారాయణ, వి.లక్ష్మి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐఎఫ్‌టియు నాయకులు అప్పలసూరి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి రాంబాబు, కార్మికులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని
ధర్మపురి వాసుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని 30వ వార్డు ధర్మపురి, సర్వే నెం. 86/1, 2, 3, 4, 5 గయ్యాలలో 3 ఎకరాల 77 సెంట్లు భూమిలో పట్టణ బడుగు బలహీన వర్గాల వారికి తక్షణమే ప్రభుత్వం ఇళ్ల స్థలాల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం పట్టణ బడుగు బలహీన వర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రెడ్డి నారాయణరావు, అప్పలరాజు లు మాట్లాడుతూ ఆ భూమిలో పూర్వం కొంతమందికి డి-పట్టాలు ఇచ్చారని, 2007లో రాష్ట్ర ప్రభుత్వం గయ్యాలుగా ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో అమ్మకాలు, కొనుగోలు లేకుండా రిజిస్ట్రేషన్లను నిలిపివేసిందన్నారు. ఇది ప్రభుత్వ భూమే అని సర్వే నెంబర్లలో ఏవిధమైన ఆక్రమణలకు గురి కాకుండా గ్రామ రెవెన్యూ అధికారికి తగు సూచనలు జారీ చేస్తూ ఎండార్సుమెంటు ద్వారా తమకు తెలియజేశారని, కావున పట్టాలు ఇప్పించి పక్కా గృహాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో పలువురు పేదలు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ధర్మపురి పేదలు

అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

వినతుల పరిష్కారంలో
గడువు దాటినందుకు షోకాజ్

- పిజిఆర్ఎస్‌కు 160 వినతులు
- బదిలీల ఫైళ్లు ముందుగానే పెట్టండి
- కలెక్టర్ బిఆర్ అంబేద్కర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చిన వినతులను 24 గంటల్లో పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం వినతులు స్వీకరించిన కలెక్టర్ అంతకు ముందు అధికారులతో సమీక్షించారు. ఆన్‌లైన్‌లో ఇంకనూ చూడాల్సిన వినతులు 8 ఉన్నాయని, గడువు దాటిన వినతులు 2 ఉన్నాయని, వినతుల పరిష్కారంలో గడువు దాటినందుకు సంబంధిత అధికారులకు షో కాజ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రంలోగా వారి వివరణలు ఇవ్వాలని తెలిపారు.

సోమవారం పిజిఆర్ఎస్ కు 160 వినతులు అందాయి. కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ , జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, ఇంచార్జ్ డిఆర్ఒ మురళి, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర రావు, నూక రాజు, ప్రమీలగాంధీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 160అర్జీలు అందగా, భూ సమస్యలకు సంబంధించి రెవిన్యూ శాఖకు అత్యధికంగా 82వినతులు అందాయి. ప్రజా వినతుల పరిష్కార వేదికకు వచ్చే నిరక్షరాస్యులకు అర్జీలను రాయడానికి కలెక్టరేట్ వద్ద సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. అర్జీదారుల కోసం షామియానా ఏర్పాటు చేసి, కలెక్టరేట్ నుండి 6 మంది సిబ్బందిని ఏర్పాటు చేయగా అర్జీ దారులు హర్షం వ్యక్తం చేశారు.

యోగంధ్ర లో రిజిస్ట్రేషన్లు సంఖ్య పెరగాలి

ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, వారి లబ్దిదారులు కూడా యోగంధ్ర లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కలెక్టర్ తెలిపారు. క్యు ఆర్ కోడ్ ఆధారంగా ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్ కావాలని తెలిపారు. జిల్లాకు 7 లక్షల 82 వేల మంది లక్ష్యం కాగా ఇంతవరకు 49 వేల మంది రిజిస్టర్ అయ్యారని, వేగం పెంచాలని తెలిపారు. సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ 4 పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు జిల్లా పర్యాటక అధికారి పర్యవేక్షణ లో నిర్వహించాలని, ఉపాధి హామీ కార్మికులతో డ్వామా పీడీ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 7గంటల నుంచి యోగా చేయించాలని తెలిపారు.

బదిలీల ఫైళ్లు ముందుగానే పెట్టండి

బదిలీల ఫైళ్లను ఆఖరి తేదీన కాకుండా ముందుగానే పెట్టాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. బదిలీలలో ఎటువంటి సిఫార్సు లను ఆమోదించడం జరగదని, నిబంధన మేరకే చేపడతామని స్పష్టం చేశారు.

జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఆనంద్, కృష్ణారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 25న జరిగిన జనవిజ్ఞాన వేదిక 18వ జిల్లా మహాసభలు సందర్భంగా 24 మందితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నూతన అధ్యక్షులుగా ఎరుకొండ ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ మిరియాల కృష్ణారావు, జిల్లా కోశాధికారిగా షిణగం శివాజీ, ఉపాధ్యక్షులుగా పంపాన రామారావు, మమ్ముల తిరుపతిరావు, సహాయ కార్యదర్శిగా యు.శాంతి కుమారి ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శి మిరియాల కృష్ణారావు.. చీపురుపల్లికి చెందిన బయాలజీ ఉపాధ్యాయుడు.

యోగా.. ఒంటికి మంచిదేగా?

- బొబ్బిలి, తెర్లాం మండలాల్లో ర్యాలీలు
- జిల్లా కేంద్రంలో యోగా స్ట్రీట్

యోగాసనాలు వేస్తున్న నగర ప్రజలు, అధికారులు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, బొబ్బిలి, తెర్లాం

ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యానికి రాచబాట వేయవచ్చునని పలువురు యోగా గురువులు పేర్కొన్నారు. యోగా ద్వారా శారీరక ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా సిద్ధిస్తుందని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రజలను చైతన్య పరిచేందుకు సోమవారం పలు మండలాల్లో ర్యాలీలు ప్రారంభమయ్యాయి. బొబ్బిలి, తెర్లాం మండలాల్లో సోమవారం ఉదయం భారీ ఎత్తున ర్యాలీలు నిర్వహించి యోగా పై ప్రజలకు చైతన్యం కల్పించారు. జిల్లా కేంద్రం విజయనగరంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యోగ స్ట్రీట్ నిర్వహించారు.

భారతీయ సంస్కృతిలో సాంప్రదాయంగా వస్తున్న వ్యవస్థల్లో యోగా ఒకటని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. నగరంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంతంలో యోగా స్ట్రీట్ ఏర్పాటు చేసి, యోగాసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కోట వరకు ర్యాలీ చేపట్టారు. ప్రజలు, నగరపాలక సంస్థ సిబ్బంది, సచివాలయ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘాల మహిళలు అధికంగా పాల్గొని యోగ ఔన్నత్యాన్ని చాటారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను వివిధ రకాలుగా జిల్లా యంత్రాంగం నిర్వహిస్తుందన్నారు. ఒక్కొక్క ప్రధాన ప్రాంతంలో రెండు రోజులు పాటు యోగ కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. యోగ వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సమాజంలో ప్రతి ఒక్కరు యోగా అభ్యసించేందుకు కృషి చేస్తున్నామన్నారు.కార్యక్రమంలో డిఆర్ డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జీవన్ రాణి, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఆనందరావు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరావు,సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు, ఇఇ టి.రాయల్ బాబు, టిపిఆర్ఒ సింహాచలం, డిఇలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

బొబ్బిలిలో యోగా ప్రదర్శన

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో యోగాసన కార్యక్రమము జరిగింది. యోగా గురువు ఎం.ఈశ్వర వరప్రసాద్ తమ శిష్య బృందంతో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో ఆయుష్ విభాగం కోమటిపల్లి డాక్టర్ సిహెచ్ కనకలక్ష్మి, శివడవలస హోమియోపతి డాక్టర్ ఎస్.సుహారిక, ఇతర డాక్టర్లు హాజరయ్యారు. యోగా ప్రదర్శన అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో, డిప్యూటీ ఎంపిడిఒ, తహశీల్దార్ తదితర మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, వెలుగు, ఉపాధి హామీ సిబ్బంది, పాఠశాలల వ్యాయామ సిబ్బంది, వివిధ రంగాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వచ్ఛందంగా వివిధ రంగాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారు.

తెర్లాంలో భారీ ర్యాలీ

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెర్లాం మండల కేంద్రంలో భారీ ప్రదర్శన నిర్వహించి, యోగాపై అవగాహన కల్పించారు. యోగా గొప్పదనాన్ని వివరిస్తూ నినాదాలు చేశారు. ఎంపిడిఓ కార్యాలయం నుంచి పాత ఆర్టీసీ బస్టాండ్ వరకూ ఈ ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ నీలిమ, ఎఒ వెంకటరమణ, ఇంచార్జి తాహశీల్దార్ జి.సత్యనారాయణ, ఇతర మండల కార్యాలయాల అధికారులు, సిబ్బంది, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, ఇతర వైద్యులు, ఆ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు, ఉపాధి హామీ, సచివాలయాల సిబ్బంది, విఆర్వోలు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా లక్షింపేట కేసు విచారణ చేపట్టాలి

కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ధర్నా

ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు, దళితులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించిన లక్షింపేట దళితుల ఊచకోత కేసును నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని ఉత్తరాంధ్ర దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. కేసు విచారణ సందర్భంగా పక్షపాత వైఖరి చూపిస్తున్న లక్షింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తిని బదిలీ చేయాలని కోరారు. సాక్ష్యులు కోరుకున్నట్లుగా సీనియర్ న్యాయవాది నవాబ్ హుస్సేన్ అక్బర్ ను ఎస్.పి.పిగా నియమించాలని డిమాండ్ చేసారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ఉత్తరాంధ్ర దళిత సంఘాల జెఎసి ఆధ్వర్యంలో దళితులు ధర్నా నిర్వహించారు. లక్షింపేట దళిత బాధితులతో పాటు జెఎసి నాయకులు పాల్గొన్నారు. లక్షింపేట మారణకాండకు కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని, 13 ఏళ్లగా నిరీక్షిస్తున్న లక్షింపేట దళిత బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు. నెత్తురు తడిచిన నేలకు న్యాయం చేయాలని కోరారు. కోర్టు హాలులోనే బహిరంగంగా సాక్షులు, ముద్దాయిల ముందే పక్షపాత పూరితంగా లక్షింపేట ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు చేస్తుండడాన్ని వారు తప్పుపట్టారు. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సాక్షుల పట్ల పక్షపాతం చూపిస్తున్నందున ఆయనను తక్షణం బదిలీ చేసి హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి ద్వారా విచారణ జరిపించాలని డిమాండ్ చేసారు. నిజాయితీగా కలిగిన,నిష్పక్షపాతంగా విచారించే న్యాయమూర్తిని నియమించాలని కోరారు. ఇప్పటికే పలువురు సాక్ష్యులు మృతి చెందారని, మరికొందరు కోర్టుల చుట్టూ తిరగలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.

అనంతరం కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కలుసుకుని లక్షింపేట బాధితుల తరపున వినతిపత్రాన్ని అందజేసారు. కార్యక్రమంలో దళిత సంఘాల జెఎసి నాయకులు డాక్టర్ కంఠ వేణు, తైక్వాండో శ్రీను, ఉదయ్ భాస్కర్, నుకతుట బాబురావు, చిత్ర గంగులు, జజ్జన గురుమూర్తి, కెల్ల బీమారావు, ముంజేటి కృష్ణ, సాకేటి నాగరాజు, బొంగ భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయానికి 32 వినతులు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాపరిష్కార వేదికలో 32 మంది తమ సమస్యలపై అదనపు ఎస్పి పి.సౌమ్యలతకు వినతులు అందజేశారు. అనంతరం ఎఎస్‌పి సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 3, మోసాలకు పాల్పడినట్లు 4, ఇతర అంశాలకు సంబంధించినవి 15 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, డిసిఆర్‌బి సిఐ బి.సుధాకర్, ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని జైభీం భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్ కుమార్.. సోమవారం డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్‌కి ఫిర్యాదు చేశారు. గుషిణి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 66/15, 79/2, 80/1లో ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని అక్రమంగా విద్యుత్తు బోర్లు వేసుకున్నారని తెలిపారు. ఇదే గ్రామం సర్వే నెంబర్ 79/2 శ్మశానవాటిక భూమి ఆక్రమణకు గురైందని చెప్పారు. కొండవెలగాడ రెవెన్యూ పరిధిలో మిత్ర రియల్ ఎస్టేట్, మరికొంత మంది రియల్ ఎస్టేట్ యజమానులు రోళ్లవాక రహదారి, సీతమ్మ చెరువును ఆక్రమించుకున్నారని చెప్పారు. సర్వే నెంబర్ 261/4లో 62 సెంట్లు, 262/5లో 2.88 ఎకరాలు, 267/1లో 30 సెంట్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి సర్వే చేయాలని కోరినా ఇంతవరకు పట్టించుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమణకు గురైన ప్రభుత్వ భూములను రక్షించాలని కోరారు.

బాడంగి తహశీల్దార్‌తో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు

సారా నిర్మూలనకు తీర్మానం

ప్రజాశక్తి-బాడంగి

నాటుసారా నిర్మూలనకు కట్టుబడి ఉంటామంటూ మండలంలోని 25 పంచాయతీలు తీర్మానించాయి. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా తమవంతు బాధ్యతగా సారా నిర్మూలనకు కృషి చేస్తామని అక్కడి ప్రజలు ప్రతిజ్ఞ చేశారని ఎక్సైజ్ సిఐ చిన్నంనాయుడు వెల్లడించారు. ఈ మేరకు సోమవారం అందుకు సంబంధించిన పత్రాలను ఎంపిడిఒ రామకృష్ణ, తహశీల్దార్ సుధాకర్‌కు అందజేశారు. సారాకు వ్యతిరేకంగా మండల ప్రజలు ఇచ్చిన తీర్మానాన్ని సిఐ అభినందించారు. సారా తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కొత్తవలస : మండలంలోని రామలింగాపురం, ముసిరాం, అప్పన్నదొరపాలెం, చిన్నమన్నపాలెం గ్రామాలను సంపూర్ణ నాటు సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ సిఐ జి.ఎస్ రాజశేఖర్ నాయుడు తెలిపారు. సోమవారం సారా తాగడం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించారు. గ్రామ కమిటీల సమక్షంలో సారా రహిత గ్రామాలుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు విఎన్ రాజు, ఎన్.రమ్యశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

కాకాని అరెస్టు అన్యాయం : శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్ష సాధిస్తుందని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే కూటమి ప్రభుత్వం మాజీమంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారని విమర్శించారు. వ్యక్తిగత పనులు కోసం కేరళ వెళ్లిన గోవర్ధన్ రెడ్డిని అన్యాయంగా అరెస్టు చేశారని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన ప్రభుత్వం అక్రమ అరెస్టులకు పాల్పడుతుందని విమర్శించారు.

2300 క్వింటాళ్ల విత్తనాలకు ప్రతిపాదన

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 2300 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని ప్రతిపాదన పంపించామని ఎఒ ధనలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. మరో రెండు, మూడు రోజుల్లో వరి విత్తనాలు మండలానికి వస్తాయని చెప్పారు. అన్నదాత సుఖీభవ పథకానికి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే పరిశీలించి, ఉన్నతాధికారులకు పంపించామన్నారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

వృద్ధాప్య పింఛన్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అర్హత కలిగిన వృద్ధులకు వయసు నిర్ధారించి, పింఛన్లు మంజూరు చేయాలని ఉత్తరాంధ్ర జన జాగృతి సంస్థ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు.. సోమవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు వేలకు పైగా వృద్ధులు 60 ఏళ్ల నుంచి 70 ఏళ్లు దాటారని, వారి ఆధార్ కార్డుల్లో వయసు తక్కువగా నమోదు చేశారని తెలిపారు. దీనివల్ల ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లకు వారు దూరమవుతున్నారని చెప్పారు. అర్హులైన వృద్ధుల వయసు నిర్ధారణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

వసతి గృహానికి మరమ్మతులు

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని గర్భాంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహానికి రూ.14లక్షలతో మరమ్మతు పనులు చేపడుతున్నట్లు వసతి గృహం సంక్షేమ అధికారి ఎస్. వెంకటరావు తెలిపారు. గదులలో పెచ్చు పెచ్చులుగా పడి పోతున్న స్లాబ్ పనులు, మరుగు దొడ్లు పనులు, వసతి గృహం మొత్తం కొత్తగా విద్యుత్ పనులు, ఆఫీస్ గదిలో టైల్స్ నిర్మాణం, కిటికీలు మరియు గదుల తలుపులు, వసతి విద్యార్థులకు తాగు నీటి సదుపాయం వంటి పనులు చేపడుతున్న తెలిపారు.

రైతు కుటుంబానికి బొత్స పరామర్శ

ప్రజాశక్తి-మెరకముడిదాం

మండలంలోని ఇప్పలవలస మాజీసర్పంచ్, చీపురుపల్లి ఆర్‌ఇసిఎస్ డైరెక్టర్ రైతు కుమారస్వామినాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో ఆయన కుటుంబాన్ని వైసిపి నాయకులు, శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ సోమవారం పరామర్శించారు. ఆయన అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మతికి సంతాపం వ్యక్తం చేశారు. బొత్స వెంట వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ వి రమణరాజు, మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, మండల వైసిపి అధ్యక్షులు కోట్ల వెంకటరావు, వైసిపి సీనియర్ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, ఇప్పల వలస గ్రామ సర్పంచ్ బెహరా రమేష్, పప్పల కృష్ణమూర్తి, బూర్లె నరేష్ కుమార్, పెనుమజ్జి అప్పలనారాయణ పలువురు పాల్గొన్నారు.

వీధి దీపాలు ప్రారంభం

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక పాత డంపింగ్ యార్డు రోడ్డులో వీధి దీపాలను మున్సిపల్ చైర్మన్ శరత్, కమిషనర్ రామలక్ష్మి ప్రారంభించారు. సాహితీ నగర్ రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడడంతో ఎమ్మెల్యే బేబినాయన దృష్టికి ప్రజల సమస్యను తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఆదేశాలు మేరకు మున్సిపల్ అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలువల్లో పూడికలు తొలగించండి

ప్రజాశక్తి-బొబ్బిలి

కాలువలలో పూడికలు తొలగించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని కంచరవీధి, సంఘ వీధి సచివాలయ పరిధిలో గల రత్నాల నగర్, ఆకులరెల్లి వీధి రోడ్డులో సోమవారం పర్యటించారు. కాలువలలో చెత్త పేరుకుపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కాలువలలో పూడికలు తొలగించాలని, డ్రెయిన్ ఔట్ లెట్లను క్లియర్ చేయాలని కోరారు. పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల కేంద్రంలో శ్రీగిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయ 57వ వార్షికోత్సవం సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగరామలింగేశ్వర శర్మ అధ్వర్యంలో రెండు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం అన్నసమారాదన చేపట్టారు.

అగ్గిపెట్టెలా గదులు.. అందులోనే తరగతులు

ఇరుకు గదుల్లోనే పాఠాల బోధన ● కనీస నిబంధనలు పాటించని ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలు ఇరుకు భవనాల్లో నడుస్తున్నాయి. ఐదంస్తుల భవనాల్లో నిర్వహిస్తున్న తరగతుల్లో కనీసం గాలి, వెలుతురు కూడా ఉండడం లేదు. జిల్లాలో 107 కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఉన్నాయి. విజయనగరంలో 27 ప్రైవేటు జూనియర్ కళాశాలలు ఉన్నాయి. భవన నిర్మాణాల నుంచి విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల వరకు అన్నింటా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస నిబంధనలు పాటించకపోయినా అధికారులు సమగ్రంగా పరిశీలించకుండా అనుమతులు ఇచ్చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దాదాపు అన్ని ప్రైవేటు కళాశాలలు అపార్ట్మెంట్లలోనే నడుస్తున్నాఇ. అగ్గిపెట్టెల్లా తరగతి గదులు ఉండడంతో అగ్నిప్రమాదాలు జరిగితే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. అయినా సరే అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

కనిపించని క్రీడలు, మైదానాలు

ప్రైవేటు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్రీడలు అనే పదమే ఉండడం లేదు. కాలేజీకి వచ్చిన నుండి చదువు రుద్దడం తప్ప మరో ఆలోచన లేదు. దీంతో విద్యార్థులు ఆటలకు దూరంగా ఉంటున్నారు. దీంతో క్రీడలు ఆడలేక అనేక మంది వారి ప్రతిభను చూపించలేని పరిస్తితి. కేవలం యంత్రం మాదిరిగా చదువు తప్ప మానసిక, శారీరక ఆరోగ్యం పట్ల కనీస అవగాహన లేకుండా పోతుంది. దీంతో ఎదిగే వయసులో అనేక మానసిక,శారీరక రోగాలు భారిన పడుతున్నారు. మరో వైపు జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్‌ను పొందే అవకాశాలను కూడా కోల్పోతున్నారు.

నగరంలో ఓ ప్రయివేట్ జూనియర్ కళాశాల

భద్రత కరువు..!

ప్రైవేటు కళాశాలల్లో అన్ని రకాలు అనుమతులూ తీసుకొని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రధానంగా అగ్గి పెట్టే లాంటి గదులు, ఇరుకు గదులు కారణంగా ఎటువంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏ కాలేజీకి వెళ్ళి చూసిన మంటలు వస్తే తీసుకోవాల్సిన ఫైర్ సేఫ్టీ కన్పించదు. అగ్నిప్రమాదం లాంటి విపత్తుల సమయం లో క్షేమంగా బయటకు తరలించేందుకు వీలుగా కిటికీలు, ద్వారాలు ఉండాలి. కాలేజీకి వచ్చే మార్గం విశాలంగా ఉండాలి. మరో మార్గం గుండా బయటకు వెళ్లాలి. కానీ దాదాపు అన్ని కాలేజీల్లో లోపలికి వెళ్లే గేటు, బయటకు గేటు ఒక్కటే ఉంటున్నాయి. ఇంతాలా ఉన్నా అధికారులు మాత్రం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదు.

అక్కడ విధులు దినదినగండమే

● శిథిల భవనంలో సచివాలయ విధులు
● ఆందోళన చెందుతున్న సిబ్బంది
● చెట్ల కింద నుంచే సేవలు

ప్రజాశక్తి-వేపాడ

గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని అంటారు. అలాంటి గ్రామాల్లో ప్రజలకు పంచాయతీ లేదా సచివాలయం ద్వారా సిబ్బంది సేవలను అందిస్తూ ఉంటారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేందుకు గ్రామ సచివాలయాలు దోహదపడుతూ ఉంటాయి. ప్రజలకు సేవలందించే ఈ సచివాలయ భవనాలు సక్రమంగా లేకపోతే విధి నిర్వహణ చేసే ఉద్యోగులకు గాని, అటు ప్రజలకు గాని ఇబ్బంది కలగక మానదు. అందుకు నిదర్శనమే వేపాడ మండలంలోని కెజిపూడి గ్రామ సచివాలయానికి పక్కా భవనం లేక పాడుబడ్డ భవనాల్లో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్న తీరు.

మండలంలోని కెజిపూడి గ్రామ సచివాలయానికి పక్కా భవనం లేదు. మూతపడిన ప్రాథమిక పాఠశాలలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. పాడు బడి పెచ్చులూడుతూ ఉన్న ఇరుకు గదిలో సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సచివాలయ పరిధిలో ఏడు గ్రామాలకు సేవలందించాల్సి ఉంది. ఇరుకుగది కావడం వల్ల వర్షం వచ్చినప్పుడు ఆ గదిలో, వాతావరణం వేడిగా ఉన్నప్పుడు ఆరుబయట చెట్ల కింద ఈ పంచాయతీ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

పునాది స్థాయిలో నిలిచిపోయిన సచివాలయ భవనం

చెట్టు కింద విధులు నిర్వహిస్తున్న గ్రామ సచివాలయ సిబ్బంది

ఈ పాఠశాల భవనం 2004లో నిర్మించారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి శ్లాబు పెచ్చులూడి పడిపోతున్నాయి. ఎప్పుడు ఎవరిపై పెచ్చులూడి పడిపోతాయోనన్న భయంతో చెట్లు కింద సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వ కాలంలో భవన నిర్మాణానికి నిధులు మంజూరైనా మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు కోర్టును ఆశ్రయించారు. దీంతో కోర్టు స్టే ఇవ్వడంతో పునాది స్థాయిలోనే పనులు నిలుపుదల చేశారు. కూటమి ప్రభుత్వమైనా గ్రామ సచివాలయ భవనాన్ని నిర్మించి, సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సహ చట్టంపై నిర్లక్ష్యం

కలెక్టర్ ఫిర్యాదు

ప్రజాశక్తి -పూసపాటి రేగ

సమాచార హక్కు చట్టంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని స.హ చట్టం ఉద్యమ నాయకులు పాండ్రంకి వెంకటరమణ.. సోమవారం పిజిఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. పూసపాటిరేగ తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నిసార్లు సహ చట్టం ద్వారా దరఖాస్తు చేసుకున్నా సరైన సమాచారం ఇవ్వడం లేదని విన్నవించారు. రికార్డుల నిర్వహణలో వ్యత్యాసం ఉందని, కొన్ని ట్యాంపరింగ్ జరిగాయని ఆరోపించారు. కార్యక్రమంలో గంటా వీర్రాజు, టి.రంగ పాల్గొన్నారు.

నేడు యోగా డే

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురంలో మంగళవారం నిర్వహించనున్న యోగా డేను విజయవంతం చేయాలని ఎంపిడిఒ రత్నం కోరారు. స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 500 మందితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఆ పాఠశాలలో యోగా డే ఏర్పాట్లను ఎంపిడిఒ పరిశీలించారు. ఔత్సాహికులైన ప్రతిఒక్కరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాదరావు, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ సన్యాసిరావు, ఇఒపిఆర్‌డి వెంకటరమణ, రామభద్రపురం పంచాయతీ ఇఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతోనే భూసారం

ప్రజాశక్తి - సంతకవిటి

నవధాన్యాల సాగుతోనే భూసారం పెరుగుతుందని ఎఒ పి.నవీన్ అన్నారు. మండలంలో మామిడిపల్లి, గోవిందపురం, గరికిపాడు, గుళ్ల సీతారాంపురం, బిల్లాని, మండవకురిటి, చిన్నయ్యపేట, అప్పలగ్రహారం గ్రామాల్లో సోమవారం నవధాన్యాల కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తే 365 రోజులూ పొలం పచ్చగా ఉంటుందన్నారు. ప్రతిరైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలన్నారు. ఎకరా పొలానికి 12 కిలోల నవధాన్యాలు వేయడంతో భూమి సారవంతం అవుతుందని తెలిపారు. నవధాన్యాల సాగుతో భూసారంతో కలుపు నివారణ జరిగి, ఎరువులు వాడకం తగ్గుతుందన్నారు. తద్వారా పెట్టుబడి తగ్గి, పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం ఆరోగ్యకరమైన ఆహారం పొందవచ్చని తెలిపారు. ఇప్పటికే మండలంలోని 1635 నవధాన్యాల కిట్లు పంపిణీ చేశామన్నారు. మరో వెయ్యి కిట్లు అవసరం అవుతుందన్నారు. ఇప్పటికే 3,835 ఎకరాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. ఎన్ఎంఎన్ఎఫ్ పరిధిలో మరో 10 గ్రామాలు బొద్దూరు, తాలాడ, పుల్లిట, సురవరం, మిత్తివలస, జి.ఎన్.పురం, ఎస్.రంగరాయపురం, మందరాడ, సిరిపురం గ్రామాల్లో భవిష్యత్తులో నవధాన్యాలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి పి.వెంకటరమణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ఎఒ నవీన్

జీలుగ, కట్టెల సాగుతో భూమి సారవంతం

రామభద్రపురం : రైతులు జీలుగ, కట్టెలు, పిల్లిపెసర విత్తనాలు నాటడంతో భూమి సారవంతం అవుతుందని వ్యవసాయాధికారి వెంకటయ్య తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. రాయితీపై రూ.650కు 10 కిలోల విత్తనాలు అందిస్తున్నామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డుపై గుంతల్లో చేరిన వర్షపునీరు

అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి - గజపతినగరం రూరల్

గజపతినగరం మండల వ్యాప్తంగా గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ప్రధానంగా వేమలి నుంచి ఎం.లింగాలవలస గ్రామానికి వెళ్లే రహదారి నాలుగు కిలోమీటర్ల వరకు ఉంది. ఈ రహదారి మట్టిరోడ్డు. దీంతోపాటు రోడ్డు అంతా గుంతలుగా ఏర్పడింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఆ నీరంతా గుంతల్లో నిండిపోయి, రోడ్డు చెరువును తలపిస్తుంది. దీనివల్ల ఆ రోడ్డుపై ప్రయాణించే రెండు గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

సాయి సిద్ధార్థ కళాశాలలో రక్తదానం

రక్తదానం చేస్తున్న కరస్పాండెంట్ చంద్రశేఖర్

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక సాయి సిద్ధార్థ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన 28వ స్వచ్ఛంద రక్తదాన శిబిరం విజయవంతమైంది. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎస్.పెద్దినాయుడు ప్రారంభించిన ఈ శిబిరంలో డాక్టర్ మైత్రేయి పర్యవేక్షణలో 24 మంది రక్తదానం చేయగా, విజయనగరం సర్వజన ఆసుపత్రి, గజపతినగరం ఏరియా ఆసుపత్రి రక్తనిల్వ కేంద్రం సిబ్బంది రక్తం సేకరించారు. కళాశాల కరస్పాండెంట్ ఎస్. చంద్రశేఖర్ ఈ శిబిరంలో పాల్గొని 46వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సింధూర్‌కు బార్ అసోసియేషన్ మద్దతు

ప్రజాశక్తి-బొబ్బిలి

జాతీయ జెండాలతో న్యాయవాదులు

ఇటీవల జరిగిన పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న ఆపరేషన్ సింధూర్ కు మద్దతుగా సోమవారం బొబ్బిలి కోర్టు ప్రాగణం లో బార్ అధ్యక్షులు మత్స ఆనంద్ కుమార్ ఆధ్వర్యం లో జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. జాతీయ జెండాలు పట్టుకొని న్యాయవాదులు, న్యాయవాదుల గుమస్తాలు విజయకేతనం ఎగురవేశారు. బార్ అధ్యక్షులు మత్స ఆనంద్ కుమార్, జనరల్ సెక్రటరి బిఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షులు రుంకాణ ప్రసాద్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ విల్సన్ బాబా, బార్ కార్యవర్గం, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి-కొత్తవలస

తరచూ వచ్చే జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పిహెచ్‌సి వైద్యులు గోపాలకృష్ణ సూచించారు. సోమ వారం తుమ్మికాపల్లి సచివాలయంలో విష జ్వరాలపై సర్వే నిర్వ హించారు. వాతా వరణంలో మార్పు వల్ల వైరల్ జ్వరాలు వస్తాయని, జ్వరాలు, జలుబు, దగ్గు, గొంతి నొప్పి, ఒంటినొప్పులు వస్తాయని తెలిపారు. అందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. మాంసం, చేపలు, గోంగూర, అరుబయట తినుబండారాలు తినరాదని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు ఉంటే చేతి రుమాలు, మాస్కులు ధరించాలని తెలిపారు. ఇంటి ముందు టైర్లు, కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ డబ్బాలు లేకుండా చూడాలన్నారు. వారానికి ఒకసారి గోలేలు, కుండీలు కడిగి ఆరబెట్టాలని చెప్పారు. పిహెచ్‌సిలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, కంప్లీట్ బ్లడ్ కౌంట్ పరీక్షలు ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు జగదీశ్వరి, విజయలక్ష్మి, వెంకటలక్ష్మి, దత్తి లక్ష్మి పాల్గొన్నారు.

ఆటో, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి-లక్కవరపుకోట

ఆటోను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సంతపేట సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మార్లాపల్లికి చెందిన కొటాన రమేష్ (38) బైక్‌పై లక్కవరపుకోట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ఆటోను సంతపేట సమీపంలో బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనం సిబ్బంది వచ్చి తనిఖీ చేయగా, అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. ఆటోలో ఉన్న ప్రయాణికుడికి గాయాలయ్యాయి.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

మహిళ హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని వెంకటరమణపేట గ్రామం వద్ద ఈనెల 17న ఎర్రాప్రగడ వెంకటలక్ష్మిని ఆమె కుమార్తె రుచిత, రుచితను ప్రేమించిన యువకుడు హరికృష్ణ కలసి హత్య చేసిన విషయం తెలిసిందే. వెంకటలక్ష్మి కుమారుడు హరీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యలో భాగమైన మృతురాలి కుమార్తె రుచితను అరెస్ట్ చేసి జువెనైల్ హోమ్‌కు తరలించామని, నిందితుడు హరికృష్ణ, వారికి సహకరించిన అతని మరో స్నేహితుడి ఆచూకీ కోసం మూడు టీంలు ఏర్పాటు చేసి గాలించామని ఎస్ఐ గంగరాజు తెలిపారు. నిందితులిద్దరూ హత్య అనంతరం బైక్‌పై తమకు తెలిసిన, ఇంతకుముందు పనిచేసిన ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లిపోయారు. పోలీసులకు అందిన సమాచారంతో వారిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారిని నుంచి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ORDER XXI RULE 54
IN THE HONOURABLE COURT OF THE DISTRICT JUDGE AT VIZIANAGARAM.
E.P.No.201/2024 in O.S.No.87/2012.

Between
Sri Allu Appala Swamy .....Decree Holder
And
Sri Siripurapu Krishna and another....JDR's
To
The 1st JDR:
Sri Siripurapu Krishna, S/o Ramu Naidu, Plot Nos.48 and 49, Sreeramnagar Colony, Dharmapuri Road, Vizianagaram.

The 2nd JDR:
Sri Siripurapu Madhuravani, W/o Krishna, Plot Nos.48 and 49, Sreeramnagar Colony, Dharmapuri Road, Vizianagaram.

Please take notice that the above execution application filed by the decree holder against you and other judgment debtors, which is posted to **30.06.2025** and you have directed to appear before the said Honourable Court at **10-30 A.M.** either personally or through an advocate, failing which the matter will be decided in your absence with the material available on record.

K.V.N. Thammanna Setty
Advocate for the Decree Holder
Chaitanya School, Mahalakshmi Nagar
100 ft, VIZIANAGARAM,
Cell : 9440193606